క్లుప్తంగా

మత్స్య, కూర్మావతారాల్లో జగన్నాథుడు



గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం స్వామివారిని మత్స్య, కూర్మ అవతారాల్లో అలంకరించి అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన అర్చకుడు హరి ఆధ్వర్యంలో అర్చకులు ఆర్.పార్థసారథి ఆచార్యులు, పి.రవికుమార్, సురేష్‌లు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను అలంకరించి పూజాకార్యక్రమాలు చేశారు. రోజువారిగా స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. గుండిచా మందిరం వద్దకు గ్రామంలోని భక్తులు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు.

మరింత మెరుగ్గా ఆర్టీసీ సేవలకు కృషి



నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: ఆర్టీసీ సేవలు మరింత మెరుగు పరిచేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆర్టీసీ డిపోలో రెండు నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు కొత్త బస్సులు వేయడ వల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యం కలుగుతుందన్నారు. పల్లె ప్రాంతాలకు బస్సు సౌకర్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కనకదుర్గ, అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు, వీఆర్‌ఏలు

మక్కువ: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, వీఆర్ఏలు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కృష్ణారావు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేలు అమలుచేయాలని, లేబర్ కోడ్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26వేలు అందించాలని కోరారు. పెన్షన్, సామాజిక భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు జి.సాంబమూర్తి, కార్యదర్శులు దాలమ్మ, పద్మావతి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

- న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్



వాహనచోదకులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

పాలకొండ రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, పలు మోటార్ వెహికల్స్‌కు చెందిన యూనియన్ల సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారికి తీవ్రమైన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. సీఐ మీసాల చంద్రమౌళి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అధిక లోడు, మితిమీరిన వేగం, మద్యం సేవించి, కాలం చెల్లిన వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 100కు సమాచారం ఇవ్వడం ద్వారా పలు శాఖల యంత్రాంగం స్పందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.ప్రశాంత్, న్యాయవాదులు పల్లా మునిస్వామి, కర్రా రవికుమార్, మరిచర్ల జగన్‌మోహనరావు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ కార్యదర్శి వెంకటరమణ

సీతానగరం: జాతీయస్థాయి కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ మండల కార్యదర్శి జి.వెంకటరమణ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి, స్కీమ్ వర్కర్లుకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనం రూ.26 వేలు ఇవ్వాలని , కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అంగన్వాడీ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను తెచ్చి నాలుగు కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వాజిల్లా కార్యదర్శి వి.రామలక్ష్మి, మధ్యాహ్న భోజన పథక సక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి, ఎం. సత్యవతి, పుణ్యవతి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

పార్వతీపురంటౌన్: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆల్ ఇండియా పిలుపులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం రూ.26,000 జీతం పెంచి, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లు తీసుకురావడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, ఉద్యోగుల వల్ల అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం వారికి వ్యతిరేకంగా నిర్ణయంచేయడం దారుణమన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ సంస్థలనూ ప్రైవేటీకరించడం వారి చేతగానితనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరాంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, విద్యుత్, ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, కాంట్రాక్ట్ అవుట్‌సోరి్సంగ్ ఆప్కాబ్ తదితర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలు మధ్యాహ్న భోజనం, సమగ్ర శిక్ష, విద్య, వైద్య104,108, రంగంలో పనిచేసే వారందరికి జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కలిగించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగస్తుల పెండింగ్ జీతాలు చెల్లించాలి. ఆటో, రైస్ మిల్లు, హమాలి, బిల్డింగ్, తోపుడు వంటి అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోశాధికారి గొర్లెల వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు వి.జ్యోతి. శాంతి. తులసి. శివాని. గౌరీశ్వరి, గౌరి, అలివేలు మంగ, కృష్ణ, పాకల సన్యాసిరావు తదితర కార్మికులు పాల్గొన్నారు.



బలిజిపేట: తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మహిళలు



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

బలిజిపేటలో..

బలిజిపేట: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళా కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మిక కోర్కెల దినం సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు ధర్నాలో మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని, 44కార్మిక చట్టాలను రద్దుచేసి 4కోడ్లుగా తీరుకురావడం దుర్మార్గమన్నారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడం వారి చేతకానితనానికి నిదర్శమని ఎద్దేవా చేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి జీతాలు పెంచి, ఉద్యోగ భద్రత కలించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



సాలూరు: అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

బీఎల్‌ఓల బకాయి జీతాలు చెల్లించాలి



ఆర్డీఓ హేమలతకు వినతి పత్రం అందజేస్తున్న బీఎల్‌ఓలు

పార్వతీపురం టౌన్: బీఎల్‌ఓల బకాయి జీతాలు చెల్లించాలని బీఎల్‌ఓల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ హేమలతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతానగరం మండలంలో బీఎల్‌ఓ విధులు నిర్వహించిన వారికి మూడు సంవత్సరాలుగా రావాల్సిన జీతభత్యాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు ఒక్కో బీఎల్‌ఓకు రూ.4000 మాత్రమే ఇచ్చారని, వారు ఇచ్చినదానికంటే అదనంగా చాలామందికి ఖర్చు అయిందన్నారు. అదనంగా అయిన ఖర్చు డబ్బులు ఇవ్వాలని, ఎన్నికల రోజు ఇవ్వవలసిన రెమ్యూనరేషన్ రూ.500 కూడా ఇంతవరకు ఇవ్వనందున దాన్ని ఇప్పించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బందికి ఒక నెల వేతనం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిందని, అందులో బీఎల్‌ఓలను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీతానగరం మండల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పాడైన బోర్లకు వేగవంతంగా మరమ్మతులు



సూరంపేటలో బోరుకు రిపేర్ చేస్తున్న మెకానిక్ సత్యనారాయణ

సీతానగరం: మండలంలో వర్షాలు కురవడం వల్ల ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయడానికి గ్రామాల్లో రిపేరులో బోర్లన్నిటికీ మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మండలంలో మరమ్మతుల బారిన పడిన బోర్లు? మరమత్తులు చేసినవి? బోర్ల నుంచి తాగు నీరు సరఫరా విధానంపై ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా సువర్ణముఖి నదిలో కలుషితనీరు ప్రవహిస్తోందన్నారు. ప్రజలు కలుషిత నీరు తాగడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని, గ్రామాల్లో ఉన్న స్కీం వాటర్‌తో పాటు బోర్లకు మరమ్మతులు చేసి తాగునీరు సరఫరా చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించామని చెప్పారు. అనంతరం సూరంపేటలో బోర్‌మెకానిక్ సత్యంనాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, బోరు మెకానిక్‌లు పాల్గొన్నారు.

వార్డుల్లో గ్యాంగ్ వర్క్స్'



పట్టణంలో గ్యాంగ్ వర్క్స్ పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: ప్రయోగాత్మకంగా పట్టణంలోని వార్డులలో గ్యాంగ్ వర్క్స్‌ను మొదలు పెట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం 1,2,20,21,29,30వ వార్డుల్లో నూతనంగా ఈ కార్యక్రమం మొదలు పెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సచివాలయాలను మూడు యూనిట్లుగా విడదీసి 30 వార్డుల పరిధిలో ప్రతి రోజు మధ్యాహ్నం మూడు సచివాలయ వార్డుల్లో శానిటేషన్ వర్కర్లతో గ్యాంగ్‌వర్క్స్ పేరిట పారిశుద్ధ్య పనులు, యాంటీ లార్వా స్ప్రేయింగ్, గార్బేజ్ రిమూవల్ తదితర పనులను ప్రారంభించినట్లు వివరించారు.కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్, ఎమినిటి, ప్లానింగ్ సెక్రెటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు చర్యలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాలకొండ: నగర పంచాయతీలోని జగనన్న కాలనీలో చేపడుతున్న జల్‌జీవన్ మిషన్ పనుల ద్వారా తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని జగనన్న కాలనీతో పాటు మండలంలోని ఎం.సింగుపురం గ్రామంలో బుధవారం పర్యటించారు. ముందుగా జగనన్న కాలనీలో ఇంటింటికీ కుళాయి ఏర్పాట్లను పరిశీలించి, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు అందించారు. అనంతరం ఎం. సింగుపురం గ్రామంలో పర్యటించారు. పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు.

పేదలపై తప్పుడు కేసులు ఆపాలి



తూరుమామిడిలో ర్యాలీ చేస్తున్న ఏపీ వ్యవసాయకార్మిక సంఘం నాయకులు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

మక్కువ: పేదలపై రెవెన్యూ అధికారులు పెడుతున్న తప్పుడు కేసులు ఆపాలని, ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శ కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మక్కువ మండలంలోని తూరుమామిడి గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ తూరుమామిడి గ్రామంలో 1995, 2019లో పేదలు, వృత్తిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు సర్వే నంబర్ 71లో సబ్‌డివిజన్ చేయకుండా పట్టాలు మంజూరుచేశారన్నారు. పట్టాలిచ్చిన స్థలంలో ఉన్నతపాఠశాల నిర్మాణం కోసం ఎకరా స్థలాన్ని కేటాయించారని, పట్టాదారులు ఇళ్లు ఎక్కడ నిర్మించుకోవాలో తెలియక ఎవరికి నచ్చిన దగ్గర వారు నిర్మించుకున్నారన్నారు. గ్రామానికి చెందిన బొద్దాన పైడమ్మ, లక్ష్మి, సింహాచలం, రాజేశ్వరిలు గతంలో పూరిళ్లు నిర్మించుకోగా, ఇప్పుడు ఆ ఇళ్లను రేకుల ఇళ్లుగా మార్చుకుంటే రెవెన్యూ అధికారులు వారిపై కేసులు పెడుతున్నారని గంగునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు పేదలపై పెడుతున్న తప్పుడు కేసులు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు, సహాయకార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సీపీఎం మండల నాయుకుడు టి.ప్రభాకర్, కార్యదర్శులు పిట్టల సీతారాం, ఆదినారాయణ పాల్గొన్నారు.

గిరిజనోద్యమ నాయకుల ఆశయాలు కొనసాగిద్దాం..



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కురుపాం: శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటంలో అశువులు బాసిన గిరిజనోద్యమ నాయకులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మ గ్రామంలో వెంపటాపు, ఆదిభట్ల 53వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటి గిరిజనోద్యమ నాయకుల పోరాట ఫలాలను నేడు మనం అనుభవిస్తున్నామన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంపటాపు భారతి, గిరిజన సంఘం, సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

పార్వతీపురం టౌన్: ఐడీఎస్ఎంటీ షాపు గుత్తకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న ఐడీఎస్ఎంటీ షాపు రూమ్‌లలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 22,32,35,44,46 రూమ్‌లను గుత్త నిబంధనల ప్రకారం ఇచ్చేందుకు బహిరంగ వేలం ఈ నెల11న ఉదయం 11గంటలకు వేలం పాట వేయనున్నామని పేర్కొన్నారు. అలాగే పురపాలక సంఘం ఆధీనంలో గల రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్ నందు ఆసీలు, కమేశాల్లో ఆసీలు వసూలు చేసుకునే హక్కు కోసం కూడా బహిరంగ వేలం గురువారం మధ్యాహ్నం 12గంటలకు పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం కార్యాలయం పని వేళల్లో సంప్రదించ గలరని తెలియజేశారు.

గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించాలి

- మండల కార్యాలయం ఎదుట ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సంఘం కార్యదర్శి ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిరంతరం సేవలందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. ఈశ్వరరావు, జె.గౌరి అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రీన్‌అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛభారత్ పథకం అమలులో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నిరంతరం సేవలందిస్తున్నామని, పంచాయతీ సర్పంచ్‌లు పది నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ పథకం ద్వారా తమకు జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చీకటి శివున్నాయుడు, కె.రాము, జె.గౌరు, బి.శంకరరావు, పి.తిరుపతిరావు పాల్గొన్నారు.

మహిళలకు వ్యక్తిగత రుణాల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు మేనేజర్ తాపేష్‌కుమార్ సేథీ

బలిజిపేట: యూనియన్ బ్యాంకు ద్వారా మహిళా సంఘాలకు చెందిన సభ్యులకు వ్యక్తిగత రుణాలు మంజూరుచేసేందుకు సిద్ధంగా ఉన్నామని మేనేజర్ తాపేష్‌కుమార్ సేథీ తెలిపారు. ఈ మేరకు మండల సమాఖ్య కార్యాలయంలో మహిళాసంఘాలతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి సీపీఎల్ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని, అదేవిధంగా మహిళలకు వ్యవసాయ రంగానికి సంబంధించి ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘాల మహిళలకు ప్రభుత్వపరంగా వ్యక్తిగత రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇంతవరకు రుణాలు పొందినవారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని, కొత్తవారికి రుణాలు మంజూరుచేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఆర్డీఓ రవితేజ, ఏపీఎం ఉమామహేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ, సీసీలు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

- ఏఓ అవినాష్



లచ్చయ్యపేట రైతు సేవాకేంద్రంలో ఎరువులు పంపిణీ చేస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ సాగు చేయడానికి రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన లచ్చయ్యపేటలో వరివెదలు వేసిన రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్ రావడం, అరకొరగా వర్షాలు కురవడం వల్ల వరి వెదలు, జొన్న, చెరకు పంటలు సాగు చేస్తున్న రైతులు ఎరువులు వేయడానికి ఇదే అదును కావడంతో ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు. నాలుగు రోజులుగా ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.గుంపస్వామి, శ్రీరాములు, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కల్పించండి



మహిళా సంఘాలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ అధికారులు

బలిజిపేట: డెంగీ వ్యాధిపై అందరికీ అవగాహన కల్పించాలని బలిజిపేట పీహెచ్‌సీ హెచ్‌వీ నాని అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మహిళా సంఘం కార్యాలయంలో మహిళా సంఘాలకు డెంగీ, పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో, నివాసగృహాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అతిసార వ్యాధి కలిగిన వారిని గుర్తించి అవసరమైన మందులు అందేలా చూడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత ఉండాలని హితవు పలికారు. వ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉంటే 14రోజుల పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను వినియోగిస్తే వ్యాధి లక్షణాలు తగ్గుముఖం పడతాయని చెప్పాలని కోరారు. డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు

గరుగుబిల్లి: రైతు సేవా కేంద్రాల్లో 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలను సరఫరా చేయడం జరుగుతుందని ఉల్లిభద్ర పశువైద్యశాల వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఉన్న పశుగ్రాస విత్తనాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుగ్రాసం వల్ల పాల ఉత్పత్తులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14వరకు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్యశిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.